క్లుప్తంగా

మనోధైర్యాన్ని కల్పించాలి

మరిపెడ: దివ్యాంగ పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించాలని ఎంఈఓ అనితాదేవి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు తల్లిదండ్రులు, తోబుట్టువులు, సహచరులు, బంధువులు అండగా నిలువాలన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఫిజియోథెరపిస్ట్ నిశాంత్, రామచంద్రు, శ్రీవేణి పాల్గొన్నారు.

'బంద్ జయప్రదం చేయండి'

నెహ్రూసెంటర్: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో నేడు(శనివారం) చేపట్టనున్న ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న, ఆటోయూనియన్ జిల్లా అధ్యక్షుడు గాడిపెల్లి శ్యాం పిలుపునిచ్చారు. మానుకోటలో శుక్రవారం నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. పాక దర్గయ్య, తిరుపతి, చంద్రశేఖర్, నాగరాజు, నవీన్, లాలు, అనిల్, పాపయ్య, లింగన్న, వెంకటేశ్, రాము పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

పెద్దవంగర: ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోపై కాంగ్రెస్ పాలనపై పాలకుర్తి నియోజకవర్గ బీజేపీ విడుదల చేసిన చార్జిషీట్ కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. భాస్కర్, కుమార్, యాకయ్య, సుమన్, సాయికిరణ్, అన్వేష్, పవన్, భిక్షపతి పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఒకరికి జైలు

మరిపెడ/మరిపెడ రూరల్: చీటింగ్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. మండలంలోని ఎడ్జర్ల శివారు పూసలతండాకు చెందిన బాదావత్ వెంకన్న ఎడ్జర్ల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ విధులు నిర్వహిస్తూ ఉపాధి హామీ పథకం డబ్బులు లబ్ధిదారులకు చెందిన రూ.27వేలు తన సొంతతానికి వినియోగించుకున్నాడు. ఈ విషయమై అప్పటి మహబూబాబాద్ అసిస్టెంట్ పోస్ట్ సూపరింటెండెంట్ కల్లూరి శ్రీధరం ఫిర్యాదు మేరకు 2015సంవత్సరంలో అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. తొర్రూర్ కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేష్‌ఆనంద్, రేవతి వాదనలు వినిపించారు. ఈక్రమంలో తొర్రూర్ సివిల్ జడ్జి మట్ల సరిత బాదావత్ వెంకన్నకు ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు.

'సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

మహబూబాబాద్: సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు వీరన్న, ఖాదర్, మల్లేష్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో భాగంగా ఖాళీ టీ కప్పులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. జానకీ రాములు, బాబులాల్, రవీందర్, కవిత, ప్రభావతి ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం ఉద్యమిస్తాం



డోర్నకల్: మండలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు కోసం ఉద్యమిస్తామని పలు సంఘాల నాయకులు తెలిపారు. డోర్నకల్ మండలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ సేవా సంఘం, యునైటెడ్ డోర్నకల్ సంస్థల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన ర్యాలీ నిర్వహించి గాంధీ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ప్రభుత్వ స్థలాలు లేవంటూ పాలకులు వసతులు, అభివృద్ధిని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

'ప్రతి పక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదు'

మహబూబాబాద్ రూరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి నెరవేర్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్తుంటే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదని ప్రజాపాలన కో ఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చేయూత

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో 1996 సంవత్సరంతో 7వ తరగతి చదువుకున్న నాటి విద్యార్థులు పాఠశాల సమస్యలు తెలుసుకుని ఫ్యాన్లు, లైట్లను హెచ్‌ఎంకు శుక్రవారం అందజేశారు.

తొర్రూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మహబూబాబాద్‌లో న్యాయవాదుల నివాళి..



మహబూబాబాద్ అర్బన్: బీజేపీ ఆధ్వర్యంలో..



దార్శనికుడు బీఆర్ అంబేడ్కర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దార్శనికుడని పలువురు నాయకులు కొనియాడారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు, మండలాలు, గ్రామాల్లో, వాడ వాడలా అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మురళీనాయక్, తొర్రూరులో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం ఎంతగా ఉపయోగపడుతుందో వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



నెహ్రూసెంటర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..



మరిపెడలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో..



మహబూబాబాద్ రూరల్ :అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

అడవుల్లో మంటలను నివారించాలి

- అటవీశాఖ ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్

కురవి: అడవుల్లో మంటలను నివారించాలని డోర్నకల్ రేంజ్ అటవీశాఖ ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కందికొండ గ్రామంలో అండవులలో మంటల నివారణ కోసం ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల్లో తిరిగే పశువుల కాపారులు, ప్రజలు మంటలు ఏర్పడడానికి కారణమైన వస్తువులను అటవీ ప్రాంతంలోకి తీసుకెల్లవద్దని సూచించారు. మంటలు రాకుండా చూసుకోవాలని తెలిపారు. అటవీ సంపదను కాపాడుకోవాలన్నారు. వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు హరిసింగ్, ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శి మద్దెలనరేష్, ఆశా కార్యకర్త మాధవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



కందికొండలో ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కురవి:మండలంలోని నేరడలోని మోడల్ స్కూల్/కాలేజీ విద్యార్థిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీకాంత్, పీడీ ఐనాల నరేష్‌లు శుక్రవారం తెలిపారు. నవంబర్ 23 నుంచి 25 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీలో మోడల్ స్కూల్/ కాలేజీలో చదువుతున్న సీఈసీ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని బి.నందిని జాతీయ స్థాయికి ఎంపికకావడంతో అభినందించారు. ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు హర్యానాలో జరిగే పోటీలో పాల్గొంటారని వివరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు..

కేసముద్రం: ఆర్మూర్, జగిత్యాలలో ఈనెల 7వ తేదీ నుంచి 9వ వరకు జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, ఇంటర్ డిస్ట్రిక్ బేస్‌బాల్ బాల, బాలికల(అండర్ 17) పోటీలకు మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌కి చెందిన విద్యార్థిని, విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ నవీన్, పీడీ లలిత శుక్రవారం తెలిపారు. ఈ మేరకు బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన రేణుక, కల్యాణి, శ్రీవిద్య, శ్రావణి, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన అజంతా, పరమేష్‌లను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. కాగా గత నెల 28న జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



కేసముద్రం: బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన కల్వల మోడల్‌స్కూల్ విద్యార్థినులు

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఫ్లెక్సీల వివాదం

నెల్లికుదురు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీలో ఒక వర్గం ఫ్లెక్సీలను గురువారం రాత్రి గుర్తు తెలువని వ్యక్తులు ధ్వంసం చేసిన వ్యవహారం శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలో కాంగ్రెస్ వర్గపోరు చిలికి చిలికి గాలి వానగా మారుతోందని చెప్పడానికి శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక వర్గం ఫ్లెక్సీలను ధ్వంసం చేయడమే నిదర్శనం. కాంగ్రెస్ పార్టీలో ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన నాటి నుంచి వర్గ పోరుతో సతమతమౌతోంది. రెండు వర్గాలు ఒకరిపై ఒకరు మాటల యుద్ధంతో రచ్చకెక్కి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నోటీసులు జారీ చేసే వరకు వెళ్లింది.ఇ ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు కాసం రంజిత్‌రెడ్డి మండల కేంద్రంలో తన పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ సెంటరో రెండు వర్గాలకు చెదిన ఫ్లెక్సీల్లో కేవలం రంజిత్‌రెడ్డికి ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం వర్గ పోరుకు ఆజ్యం పోసినట్లు అంతుందని మండలంలో చర్చ జరుగుతోంది. ఇదే విషయమై మండల కేంద్రంలో కొంతమంది అనుమానిత యువకులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు గుగులోతు బాలాజి నాయక్ తెలిపారు.



చిరిగిన ఫ్లెక్సీ

రైతులకు సౌకర్యాలు కల్పించాలి

మహబూబాబాద్ రూరల్ : కొనుగోలు కేంద్రాలలో రైతులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని బోడగుట్ట తండాలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మండల కార్యవర్గం ఆధ్వర్యంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు.కార్యక్రమంలో కొమురెల్లి సోమిరెడ్డి, జక్కుల శ్రీనివాస్, గూడూరు లక్ష్మయ్య, మింగు భగవాన్, గుండెబోయిన లింగమల్లు, మహమూద్, పులిగిల్ల బాలమల్లు పాల్గొన్నారు.

మిల్లర్లతో కొనుగోలుదారుల కుమ్మక్కు

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు మారగాని రాజు గౌడ్ అన్నారు. ముడుపుగల్‌లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించి, మాట్లాడారు. సుమారు బస్తా ధాన్యం 40 కిలోల 600 గ్రాములు తూకం వేయాల్సిఉండగా 41 కిలోల 200 గ్రాములు తీస్తున్నారని తెలిపారు.

నేడు సీఎం కప్ ఎంపిక పోటీలు

నెల్లికుదురు: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న (నేడు శనివారం) సీఎం కప్ గ్రామ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఐలయ్య శుక్రవారం తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కబడ్డీ, ఖోఖోతోపాటు ఇతర క్రీడాంశాల పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

11,12తేదీల్లో మున్సిపల్ స్థాయిలో..

మహబూబాబాద్: ఈనెల 11,12 తేదీల్లో మున్సిపాలిటి స్థాయిలో సీఎం కప్ క్రీడలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భగవాన్‌రెడ్డి తెలిపారు. క్రీడల నిర్వహణపై మున్సిపల్ లెవల్ కమిటీ సమావేశం చెర్మన్ రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే ఈ క్రీడలకు అదే రోజు ఉదయం 9 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వైస్ చైర్మన్ వెంకన్న, కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, చాంప్లా, విజయ్‌కుమార్, కుమార స్వామి పాల్గొన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

డోర్నకల్: సీఎం కప్ క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల కన్వీనర్, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్ ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పీఈటీలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాపోటీలకు శుక్రవారం సంబంధిత అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఉత్తర్వులు రాకముందే విధుల్లోకి..

- డీడబ్ల్యూఓగా వచ్చిన ధనమ్మ
- అయోమయంలో సిబ్బంది

మహబూబాబాద్: జిల్లా సంక్షేమాధికారిగా పని చేసిన వరలక్ష్మి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దాంతో ఖాళీ అయిన ఆ స్థానంలో తనకు పోస్టింగ్ వచ్చినట్లుగా ఓ అధికారి సదరు కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరారు. కానీ, ఆ ఉత్వర్వులు కమిషనర్ కార్యాలయం నుంచి అధికారికంగా మెయిల్ ద్వారా రావాల్సి ఉంది. ఆ ఉత్తర్వుల పత్రం అధికారికంగా రాకపోవడంతో కార్యాలయంలో పని చేసే అధికారులు, సిబ్బంది అయోమయంలో ఉన్నారు.

అక్టోబర్ 31న వరలక్ష్మి ఉద్యోగ విరమణ

మానుకోట జిల్లా సంక్షేమాధికారిగా పని చేసిన వరలక్ష్మి ఈఏడాది అక్టోబర్ 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. దాంతో సీడీపీఓ శిరీషకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. కాగా ఈనెల 2వ తేదీన ఎం.ధనమ్మ అనే అధికారి తనకు మానుకోట జిల్లా డీడబ్ల్యూఓగా బాధ్యతలు అప్పగించారని ఉత్తర్వులతో కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. కానీ ఆ అధికారి ఖమ్మం జిల్లా మదిర సీడీపీఓగా పని చేసిన తర్వాత ఏడీగా పదోన్నతి వచ్చింది. దాంతో అసిఫాబాద్ డీడబ్ల్యూఓగా పోస్టింగ్ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆ జిల్లాలో బాధ్యతలు స్వీకరించకుండా హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్‌కు సరెండర్ చేసినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ధనమ్మ మానుకోట జిల్లా సంక్షేమాధికారి ఉత్తర్వులతో వచ్చినప్పటికీ మెయిల్ ద్వారా ఇక్కడకు ఉత్తర్వులు రాలేదు. ఆ పోస్టింగ్‌ను పెండింగ్‌లో పెట్టారా.. లేక ఇతర వత్తిడి మూలంగా నిలిపి వేశారా.. అనే కోణాలలో సిబ్బంది ఆలోచిస్తున్నారు. దాంతో చేసేంది ఏమీ లేక ఆ అధికారి ధనమ్మ ఈనెల 6వ తేదీన ఆశాఖ కమిషనర్ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. ఆ కార్యాలయం నుంచి మెయిల్ ద్వారా అధికారికంగా వస్తేనే నిబంధనల ప్రకారం పోస్టింగ్ ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

కొవ్వొత్తులతో ర్యాలీ

మహబూబాబాద్ అర్బన్: రాయచోటిలో ఉపాధ్యాయుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ మానుకోట జిల్లా ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా యూనియాన్ అధ్యక్షుడు గండు మురళి, నాయకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీని చేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బోచినపల్లి సుధాకర్, బట్టు అశోక్, కోశాధికారి రాంబాబు, నాయకులు గాడిపల్లి సుమన్, అర్జున్, శంకర్, ఉప్పలయ్య, యాసీన్, నర్సయ్య, సుధాకర్, కర్ణసాగర్, నరేష్, సంతక్లష్ పాల్గొన్నారు.



వైభవంగా రాములోరి వార్షికోత్సవం

- రెడ్యాలలో నేడు కల్యాణోత్సవం

మహబూబాబాద్ రూరల్ : త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళశాసనాలతో సీతాలక్ష్మణహనుమత్ సమేత రామచంద్ర స్వామి వారి చతుర్ధ వార్షికోత్సవాలు రెడ్యాల గ్రామంలో గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి బిందురెడ్డి, ఎన్నారై వెన్నం విజయకాంత్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, అంకురారోపణ పూజలు నిర్వహించారు. శుక్రవారం యాగశాలలో ద్వార తోరణ, ధ్వజస్తంభ ఆరాధన, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర యజ్ఞం, పూర్ణాహుతి, బలిహరణ పూజలు జరిపారు. శనివారం ఉదయం మహాసుదర్శన యాగం జరిపి, సాయంత్రం ఆరు గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కంతమహేశ్వరస్వామి కల్యాణం

చిన్నగూడూరు: మండల కేంద్రంలో కంతమహేశ్వరుని కల్యాణ వేడుకలను గౌడ కులస్తులు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. వారం రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం కంతమహేశ్వరస్వామి ఆలయంలో ఉదయం జపమాల కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం జలబిందెలతో వాడవాడనా శోభాయాత్ర నిర్వహించి ఆలయంలో స్వామి వారికి అభిషేకం, పూజలు చేశారు.



ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న అర్చకులు



జలబిందెలతో వెళ్తున్న స్వాములు, భక్తులు

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

నెల్లికుదురు: వెలమ కులస్తులను కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నల్లాని ప్రవీణ్ రావు తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థుల అల్పాహారానికి సాయం

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం ఉన్నతపాఠశాల 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం గ్రామానికి చెందిన ఇంజమూరి రేణుక శుక్రవారం రూ.10 వేలు అందించారు. పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినవారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా నగదు రూపంలో ఇవ్వనున్నట్లు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

మహబూబాబాద్ రూరల్ : నడివాడ గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచందర్ రావు, పార్టీ అడహక్ కమిటీ సభ్యులు ప్రేమ్‌చంద్ వ్యాస్ పాల్గొన్నారు.

ప్రత్యక్ష తరగతులు ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ విద్యార్థులకు ప్రత్యక్ష తరగతులు ఈ నెల 8న (ఆదివారం) ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5: 30 గంటల వరకు ప్రారంభమవుతున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్, కోఆర్డినేటర్ హతిరామ్ శుక్రవారం తెలిపారు. 73829 29705 ద్వారా సంప్రదించాలని సూచించారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికి 200 గజాల స్థలంలో ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎర్రయ్యకు, ఆ పార్టీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నాగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళాజాతా

చిన్నగూడూరు: తుమ్మలచెరువు తండా, విస్సంపల్లి, ఉగ్గంపల్లి గ్రామాలలో శుక్రవారం కళాజాత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా, ప్రభుత్వ విధానాలను కళాకారులు తమ ఆట, పాటలతో ప్రజలకు తెలిపారు.


మోటార్ కనెక్షన్ కోసం ప్రదక్షిణ

నర్సింహులపేట: మండల పరిధిలోని తన వ్యవసాయ భూమిలో గత 15 రోజుల క్రితం బోరు వేసుకున్న అలువాల రవి అనే రైతు మోటారు కనెక్షన్ కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. విద్యుత్, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ దాటవేస్తుండడంతో రైతుల ఆవేదనతో శుక్రవారం విలేకరులను ఆశ్రయించాడు. ఈ విషయమై తహసీల్దార్ నాగరాజును వివరణ కోరగా.. రైతుకు పట్టా పాసుబుక్ ఇచ్చామని, విద్యుత్ కనెక్షన్ కోసం ప్రత్యేకంగా మీము సంతకాలు ఏమీ పెట్టేదిలేదని తెలిపారు. దీనిపై ఏఈ పాండుతో మాట్లాడగా.. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు సీ-ఫారంపై రెవెన్యూ అధికారులే సంతకం పెట్టి ధ్రువీకరించేవారు. ప్రస్తుతం వారు ధ్రువీకరించకపోవడంపై ఉన్నతాధికారులను అడిగి తెలుసుకుంటామని చెప్పడం కొసమెరుపు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: 8వ తేదీన జరగనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ స మావేశాలను జయప్రదం చేయాలని అరుణోదయ రాష్ట్ర నాయకుడు బద్దుల పాపన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కౌన్సిల్ పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు.

ఆర్థిక సాయం



బయ్యారం/మహబూబాబాద్ అర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గంధంపల్లికి చెందిన ఉపాధ్యాయుడు సంద్ర ఉపేందర్‌రావు కుటుంబానికి టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. సంద్ర ఉపేందర్‌రావు కుటుంబానికి ఉపాధ్యాయుడు రవీందర్‌నాయక్ సహకారంతో మానుకోట ప్రభుత్వ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం రూ.6,608 అందించారు. హెచ్‌ఎం సిరినాయక్, వాసుదేవ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంలో రగిలిన మంటలు

గూడూరు: మండల కేంద్రంలోని ఓ టీ స్టాల్ ఎదుట శుక్రవారం నిలిపి ఉంచిన ద్విచక్రవాహనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు కొందరు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి

గార్ల: మండలంలో వరిధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని తహసీల్దార్ రవీందర్ సూచించారు. శుక్రవారం గార్లలోని పలు ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం క్వింటా సన్నధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తున్నందున, రైతులు తాలు చెత్తచెదారం లేకుండా కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. డీటీ సుధాకర్, ఏఈఓ కిరణ్, తదితరులు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

దంతాలపల్లి: ఓ కారు చెట్టుకు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్‌కు చెందిన వెంకటరమణ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వేంశెట్టి కిషోర్‌కుమార్, మరిపెడ మండలం తాళ్ల ఊకల్ గ్రామానికి చెందిన తిరిపిశెట్టి గోవర్దన్, తిరిపిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం కారులో తొర్రూరు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే మండలకేంద్రానికి సమీపాన చారి తండాదగ్గర కారు అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కిషోర్‌కుమార్, గోవర్ధన్‌కు గాయాలయ్యాయి.

బయ్యారం: మండలంలోని సంతులాల్ పోడుతండాకు చెందిన దబ్బ వెంకటరమణ బయ్యారం నుంచి శుక్రవారం సంతులాల్‌పోడుతండాకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాయిబాబాగుడి వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న బైక్‌ను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు ఫోన్ చేయగా అరగంట తర్వాత వచ్చి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కేసముద్రం: వ్యవసాయ బావిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంవిలేజ్ శివారులోని ఈదులకుంట సమీపాన ఓ రైతుకు చెందిన వ్యవసాయబావిలో ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడకు చేరుకుని, మృతదేహన్ని బయటకు తీయించి, పరిశీలించారు. మృతుడి వయస్సు 35–45 సంవత్సరాల మధ్య ఉంటుందని, అతడు బ్లాక్ కలర్ షర్టు, బ్లాక్ కలర్ పాయింట్ ధరించినట్లు ఎస్సై తెలిపారు. నాలుగు రోజుల క్రితం బావిలో పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడా.. లేక ఆత్మహత్యా.. లేకుంటే ఎవరైన హత్య చేసి పడేశారా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో స్వయం పరిపాలన

కురవి: మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు స్వయం పరి పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కార్తీక్, కరస్పాండెంట్ ఉమ, వెంకన్న, జ్యోతి, నవ్య, లక్ష్మి, స్వప్న, రేణుక, మణిషా, ఫర్జానా పాల్గొన్నారు.

యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

కురవి: యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్స్ బాలరాజ్, వంగజాన్‌మార్క్, కేఎంపీఎఫ్ఏ ఫౌండర్ పాస్టర్ కృపానందం అన్నారు. గురువారం రాత్రి మండలంలోని మోద్గులగూడెం రాజు రైస్ మిల్లు గ్రౌండ్‌లో గ్రాండ్ క్రిస్మస్ కార్యక్రమాన్ని కేఎంపీఎఫ్ఏ పాస్టర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వాసులు పాటలు పాడారు. హైదరాబాద్‌కు చెందిన అనిత, శ్రీనివాస్, ప్రోగ్రాం కన్వీనర్ జాన్ వెస్లీ, బైబిల్‌రీడింగ్ ఉపాధ్యక్షుడు రత్నరాజు, పాస్టర్ హనోక్, పర్యవేక్షకులు జాన్ పీటర్, బిషప్ మల్సూర్, దేవసహాయం, విజయ్‌కుమార్, పాస్టర్ యేసుపాదం, ప్రేమ్‌కుమార్, డేవిడ్, యోహాను పాల్గొన్నారు.



ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న పాస్టర్స్